# 3. ముక్కు పుడక



మళ్ళీ పెళ్ళి చూపులు.

రమకు తనలోపల ఏదో గడ్డకట్టుకుపోయిన అనుభూతి కలుగుతోంది. ఇప్పటికి ఆరు సంవత్సరాలనుంచీ సంవత్సరానికి ఐదారుసార్లకు తక్కువకాకుండా ఈ పెళ్ళిచూపులు జరుగుతూనే ఉన్నాయి. రమ ఇంటర్ రెండో సంవత్సరంలోకి వచ్చినప్పటినుండి మొదలైనాయి. రమ బి.ఏ పాసయ్యి రెండేళ్ళనుంచీ ఉద్యోగం చేస్తోంది.

రమ చూపులకు బాగానే ఉంటుంది. చామనఛాయ. కళగల ముఖం. ముక్కు కాస్త పొట్టిగావున్నా లావనిపించేలా వున్నా చట్టిముక్కు అనిపించుకోదు. పెద్ద జడతో లావుకు తగిన ఎత్తుతో బాగానే ఉంటుంది రమ.

ఐతే అసలు సమస్య వేరే ఉంది. వచ్చి చూసి వెళ్ళిన వాళ్ళందరికీ పిల్ల నచ్చలేదని కాదు. పిల్ల నచ్చటం నచ్చకపోవటం అనే సమస్య చాలా తక్కువసార్లే వచ్చింది. అసలు నచ్చనిదీ రమ తండ్రి యిచ్చే కట్నం. అసలు సమస్య అదే!

ఐతే ఏది సమస్య అనేదీ అర్థమైతే, అసలు సమస్య ఎక్కడుందో సరిగా గుర్తించగలిగితే ప్రపంచంలో సమస్యలన్నీ తేలిగ్గానే పరిష్కారమవుతాయి.

ఒక సమస్యలో ఎన్నో రకాల కోణాలూ, నీడలూ. సమస్య ఒకచోట వుంటే దాని నీడ యింకో చోట కనబడుతుంది. నీడనే అసలు సమస్య అనుకుని మనం దాన్నక్కడ పట్టుకుంటాం. అలాగే రమ పెళ్ళి చూపుల్లో కొన్నాళ్ళు సమస్యంతా రమ ముక్కుమీద కేంద్రీకృతమయింది.

రమకి చిన్నప్పుడు వాళ్ళ నాయనమ్మ చెవులతోపాటు ముక్కూ కుట్టించింది. మూడేళ్ళ రమ బావురుమని ఏడుస్తూ తప్పించుకోబోయింది గానీ కుదరలేదు. ముక్కు కుట్టారు. రమ గింజుకోవటంతో ఒకచోటగాక రెండుచోట్ల చిల్లులు పడ్డాయి. మళ్ళీ నాయనమ్మ రమ కాళ్ళూ చేతులూ అదిమి పట్టుకుంటే రెండు చిల్లులూ కలిపేసి ఒకే పెద్ద చిల్లు పొడిచాడు ముక్కు కుట్టే అబ్బాయి.

తర్వాత చెవులకు పడ్డ పుళ్ళు తొందరగానే మానాయిగానీ ముక్కుకి బాగా చీముపట్టింది. జ్వరం వచ్చింది. పదిహేనురోజులు పిల్లను పీల్చి పిప్పి చేసి గానీ జ్వరం తగ్గలేదు.

నాయనమ్మ తన బేసరి రమకేనని బహిరంగంగా ప్రకటించింది. రమకి పదేళ్ళ వయసులో నాయనమ్మ చచ్చిపోతే ఆ బేసరి రమ ముక్కుకి పెట్టింది రమ తల్లి. బళ్ళో అందరూ వెక్కిరించటంతో రమ దాన్ని తీసి పెట్టెలో దాచింది.

ఐతే ముక్కుకి కన్నం మాత్రం అలాగే ఉంది. అక్కడ పడిన మచ్చకూడా నల్లగా మిగిలిపోయింది. రమ కాలేజీలో చేరేనాటికి ముక్కుపుడకలు మరీ మోటయ్యాయి. రమ తోటివాళ్ళెవరూ ముక్కు కుట్టించుకోనే లేదు.

చాలామంది రమ ముక్కువంకా చిల్లివంకా మచ్చవంకా అదేపనిగా చూసేవారు.

"అదొక్కటేనే నీకు వంక" అనేవారు.

"అది వుంటే మాత్రం ఏమయిందిప్పుడు గాలి పీల్చటానికి అది అడ్డంకాదు. వాసన చూడటానికి అడ్డంకాదు. ముక్కుకి సంబంధించిన జబ్బులేమీ లేవు. కనీసం నాలుగేళ్ళకోసారి కూడా జలుబన్నా చెయ్యదు. నా ముక్కుకేం బంగారం" అనేది రమ.

"మిగిలిన వాటికి అడ్డంకాదుగానీ రేపు నీ పెళ్ళికి అదే అడ్డం వస్తుంది చూస్తుండు" అంది శైల.

శైలని అందరూ చట్టిముక్కు అనేవాళ్ళు.

శైల అనే కాదు అందరూ ఎవరికి వాళ్ళు తమ అవయవాలు.... ముఖ్యం ముఖం....ఫర్ ఫెక్టుగా ఉందా లేదా అని పరీక్షించుకుంటూనే ఉండేవాళ్ళు. దానిలో భాగంగా ముక్కు గురించి కూడా దిగులుపడుతుండేవారు. ఒకమ్మాయికి ముక్కు మరీ పొడుగని దిగులు- ఒకమ్మాయికి ముక్కు పొట్టిగా ఉందని దిగులు. ఇంకొక మ్మాయికి ముక్కు వంకరని దిగులు. ఇంకొకరికి ముక్కు కిందికి వాలిపోయిందని దిగులు. అందరి మనసుల్లో ఓ ముక్కు ఉండేది.

నిటారుగా సన్నగా సూదిలా మొనదేలిన ముక్కు. కవులూ రచయితలూ వర్ణించే ముక్కు.

"అలాంటి ముక్కు ఉంటే ఎంత బాగుండు" అని పెద్దగా అంది మల్లిక తెలుగు మాస్టారు మనుచరిత్రలో ముక్కు పద్యం చదివి చెప్పినప్పుడు.

సంపంగి మొగ్గలాంటి ముక్కు.

కథల్లో నవలల్లో నాయికలకుండే అందమైన ముక్కు.

తమకు లేని ఆ 'నాసిక'ను తల్చుకుని అమ్మాయిలందరూ తమ ముక్కుల మీద అసంతృప్తితో ఉండటం రమకు విసుగ్గా ఉండేది.

కానీ తన ముక్కే తనకో సమస్య ఔతుందని క్రమంగా ఆమెకు తెలిసి వచ్చింది.

వరసగా నలుగురు పెళ్ళివాళ్ళు రమ ముక్కు గురించీ దానికున్న చిల్లి గురించీ మచ్చ గురించీ మాట్లాడేసరికి ఇంట్లో అందరికీ భయం పట్టుకుంది.

ముక్కు కుట్టించి చచ్చిన నాయనమ్మను శాపనార్థాలు పెట్టింది రమ తల్లి.

ఐదో సంబంధం వాళ్ళు-

"డబ్బుదేముంది లెండి మా అబ్బాయికి అందం ప్రధానం. మీ అమ్మాయేమో చామనఛాయ. పైగా ముక్కుమీద అదొకటి"

అంటూ నాన్చడం చూశాక ఆ చిల్లినెలాగైనా పూడ్పించాలనుకున్నాడు రమ తండ్రి.

రమ బి.ఏ రెండవ సంవత్సరంలో ఉండగా గుంటూర్లో పెద్ద సర్జన్ దగ్గరకు వెళ్ళి ఆ మచ్చ కనపడకుండా సర్జరీ చేయించాడు రమకి.

మచ్చలేని ముక్కు తనను వెక్కిరిస్తున్నట్టుంటే నిట్టూర్చింది రమ.

సంవత్సరాలుగా అలవాటైన ఆ మచ్చ రమ శరీరంలో భాగమైంది. అది లేక పోతే కొన్నాళ్ళు రమకు ఏదో వెలితిగానే అనిపించింది.

ఐనప్పటికీ "పోన్లే. ఇంకేం వంక పెడతారూ?" అనుకుంది.

స్నేహితులందరూ సంతోషించారు. "ఇక నీ పెళ్ళి అవుతుంది పొమ్మ" న్నారు.

'పెళ్ళికోసం ఆడపిల్లలు వీలైతే తమ ప్రతి అవయవాన్నీ మార్చుకోవాలేమో ఆ పెళ్ళివాళ్ళ ఇష్టాలకనుగుణంగా' అనుకుంది రమ.

తెల్లగా ఉండే శోభని "మరీ అదేం తెలుపమ్మా పిచ్చి తెలుపు కళాకాంతీ లేదు" అన్నారు.

పెద్ద కళ్ళున్న వాణిని "అవేం మిడిగుడ్లూ, అవేం చూపులు" అన్నారు.

తమ ఎదురుగా ఓ ఆడపిల్ల పెళ్ళికోసం కూచున్నదనేసరికి మగపెళ్ళివాళ్ళ కళ్ళకు ఏదో జబ్బు వస్తుందని రమకు గట్టి నమ్మకం కలిగింది.

రమ బి.ఏ పూర్తయింది. రెండేళ్ళనుంచీ టైపిస్టుగా ఉద్యోగం కూడా చేస్తోంది.

ఐనా సంబంధం కుదరలేదు. ప్రయత్నాలూ ఆగలేదు. ఈ రెండేళ్ళలో ఒకానొక సినిమాతార పుణ్యమా అని ముక్కుపుడకలు మళ్ళీ ఫ్యాషనయ్యాయి. అమ్మాయిలందరూ పొలోమని ముక్కులు కుట్టించుకోసాగారు. తన ముక్కు చిల్లిని చూసి నవ్విన వాళ్ళంతా ముక్కులు కుట్టించుకోటానికి పరుగెత్తుతుంటే రమ ఆశ్చర్యంతో తల మునకలయింది,

ఇవాళ రాబోతున్న సంబంధం గురించి అందరికీ ఆశలున్నాయి. అబ్బాయి లెక్చరరు. కట్నం పాతికవేలు చాలని ఒప్పుకున్నాడు. పెళ్ళికొడుక్కి ఒక్కతే అక్కగారు. ఆ అక్కగారు మూడేళ్ళనుంచి రమ వాళ్ళ పక్కింట్లో అద్దెకుంటున్నారు. ఆవిడ పేరు సావిత్రి. సావిత్రే చొరవ తీసుకుని ఈ సంబంధం చాలావరకు స్థిరపరచింది. అబ్బాయి ఫొటో అమ్మాయి, అమ్మాయి ఫొటో అబ్బాయి చూశారు. అబ్బాయి ఒకటి రెండుసార్లు సావిత్రి దగ్గరకు వచ్చినపుడు రమ హఠాత్తుగా కనబడి మాయమయింది కూడా. అబ్బాయి సత్యనారాయణ లాంఛనంగా పెళ్ళిచూపులకు

రావటమే కాని అమ్మాయి నచ్చలేదని చెప్పటానికి రావటంలేదని అందరికీ నమ్మకంగానే ఉంది.

ఐనా అందరిలో ఏదో బెదురు.

"కాస్త రంగుంటే ఇంత బాధ ఉండేది కాదు" అని గొణుక్కుంది తల్లి.

రమకి కూడా పెద్ద ఉత్సాహం లేదు. మామూలుగా అన్నిసార్లూ తయారయినట్లే తయారయింది.

తంతంతా ముగిసింది. వాళ్ళు సంతోషంగానే వెళ్ళారు.

పదిరోజుల్లో నిశ్చితార్థానికి ఏర్పాట్లు చెయ్యమన్నారు. రమకు నెత్తిమీద పెద్ద బరువేదో దిగినట్లయింది.

శుభ్రంగా భోజనం చేసి సాయంత్రం ఐదింటిదాకా గాఢనిద్ర పోయింది.

అయిదింటికి సావిత్రి వచ్చి లేపింది.

"లే లే నిద్రలో మా తమ్ముడిని మించేలా ఉన్నావే" అంటూ

రమ సిగ్గుపడుతూ లేచింది.

"ఇపుడు నువ్వు అర్జెంటుగా చెయ్యాల్సిన పని ఒకటుంది" అంది సావిత్రి.

"ఏంటది" అంది రమ బద్ధకంగా ఆవులిస్తూ.

"ముక్కు కుట్టించుకోవాలి"

ఆవులింత అయిపోయినా రమ నోరు మూతపడలేదు.

"మా తమ్ముడికి ముక్కుపుడక అంటే చచ్చేంత ఇష్టం. ముక్కుపుడక లేని ఆడదాని ముక్కుకి అందమే లేదంటాడు. 'అంతా బాగానే ఉందిగానీ ఆ అమ్మాయికి ముక్కుపుడక లేదక్కా' అన్నాడు. అదెంతపనిరా అన్నాను. నీకు రవ్వ వేసిన ముక్కుపుడక చేయిస్తానన్నాడు. రెండువేలకు తక్కువకాదు. అదృష్టమంటే నీదే. లే- లే- ముక్కు కుట్టించుకుందాం పద" సావిత్రి గబగబా మాట్లాడేస్తోంది.

"నేను ముక్కు కుట్టించుకోను. ఈ పెళ్ళి ఆగిపోయినా సరే"

రోషంతో కోపంతో రమ ముక్కుపుటాలు అదురుతున్నాయి.

అవి అందంగా ఉన్నాయో లేదో చెప్పగల వాళ్ళెవరు?

— ఈనాడు 13-5-1990

3)